సమస్యల మంటపై వంట!

నవంబర్ నుంచి పెండింగ్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు, వేతనాలు

- ఆరుబయటే వంటావార్పు
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- పట్టించుకోని అధికారులు



మత్కేపల్లి ఉన్నత పాఠశాలలో తరగతి గది గోడ పక్కనే వంట చేస్తున్న నిర్వాహకులు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం సమస్యల మంటపై ఉడుకుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లోని వంట గదుల నిర్మాణాలు, బిల్లులు, వేతనాల చెల్లింపుపై శ్రద్ధ చూపకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఆరుబయటే భోజనం తయారు చేయాల్సి రావటంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల పక్కనే పొయ్యి పెడుతుండటంతో పొగతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతేడాది నవంబర్ నుంచి బిల్లులతో పాటు గుడ్ల బిల్లు, ప్రభుత్వం చెల్లించే రూ.2 వేల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 30 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చింతకాని, కొదుమూరు, నాగులవంచ, మత్కేపల్లి, రామకృష్ణాపురం, తిమ్మినేనిపాలెం, చినమండవ, ప్రొద్దుటూరు, పాతర్లపాడు, నేరడ, లచ్చగూడెం ఉన్నత పాఠశాలలతో పాటు నర్సింహాపురం ఎస్సీ కాలనీ, కొదుమూరు ఎస్సీ కాలనీ, రామకృష్ణాపురం, నాగులవంచ జీపీఎస్ ప్రాథమిక పాఠశాలల్లో వంట గదులు లేవు. వంట గదులున్నా పాఠశాలల్లో కూడా కొంతమంది ఆరుబయటే వంట చేస్తున్నారు.

నిర్వాహకుల ఇక్కట్లు..

పాఠశాలల్లో వంట గదులు లేకపోవటంతో ఏజెన్సీ నిర్వాహకులు పాఠశాల ఆవరణలో ఆరుబయటే వంట తయారుచేసి విద్యార్థులకు అందిస్తున్నారు. అయితే పాఠశాల ఆరుబయట కట్టెల పొయ్యి మీద వంట చేయటం ఇబ్బందిగా ఉంటుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించటం సాధ్యం కావటం లేదంటున్నారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్‌లో వర్షాలు కురుస్తుండటంతో వంట చేయటానికి ఇబ్బందికరంగా ఉంటుందని నిర్వాహకులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా భోజనం, గుడ్ల బిల్లులతో పాటు తమ వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పాఠశాలల్లో వంట గదుల నిర్మాణాలు, సకాలంలో బిల్లులు, వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

వంట గదులు నిర్మించాలి



పాఠశాలల్లో వంట గదులు నిర్మించాలి. గదులు లేక ఆరుబయటే వంట చేయటం చాలా ఇబ్బందిగా ఉంది. కట్టెల మీద తరగతి గదుల పక్కన వంట చేయటం పొగతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. గదులను నిర్మిస్తే వంట సామగ్రిని కూడా జాగ్రత్త చేసుకోవడానికి వీలుంటుంది. అధికారులు తక్షణమే గదులను నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలి.

– దంతెలపల్లి సులోచన, కార్మికురాలు, మత్కేపల్లి

రూ.10 వేల వేతనం ఇవ్వాలి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం భోజన కార్మికులకు నెలసరి రూ. 10 వేల వేతనం ఇవ్వాలి. గత నవంబర్ నుంచి భోజనం, గుడ్ల బిల్లులతో పాటు వేతనాలు కూడా ఇవ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంట గదుల నిర్మాణం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికి ఫలితం లేదు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

– తప్పెట పుల్లమ్మ, కొదుమూరు

నిధుల రాక నిర్మాణంలో జాప్యం



ప్రతీ పాఠశాలలో తప్పనిసరిగా వంట గది ఉండాలి. ఆరుబయట వంట ఆరోగ్యకరం కాదు. నిధులు సకాలంలో రాక గదుల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ప్రస్తుత వర్షాకాలంలో ఆరుబయట వంట చేయడం నిర్వాహకులకు ఇబ్బందిగానే ఉంటుంది. మనఊరు–మనబడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం కింద గదుల్ని నిర్మించాల్సి ఉంది.

– మోదుగు శ్యాంసన్, ఎంఈఓ, చింతకాని

క్లుప్తంగా

ముదిగొండ సీఐగా మురళి బాధ్యతలు



ముదిగొండ: ముదిగొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సీఐ వడ్డెపల్లి మురళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి ఎస్సై నరేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామిక ప్రాంతం, మండల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో పోలీస్‌స్టేషన్ స్థాయిని పెంచడం జరిగిందన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎర్రుపాలెం ఏఓగా రాధ



ఎర్రుపాలెం: మండల వ్యవసాయాధికారిగా మందుల రాధ మంగళవారం మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముదిగొండ ఏఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ మండలంలోని రైతులకు తమ సేవలను తగిన స్థాయిలో అందిస్తామన్నారు.

బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రాఘవ్‌గౌడ్



బోనకల్: బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మండలకేంద్రానికి చెందిన యార్లగడ్డ రాఘవను ఎంపిక చేస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ మంగళవారం నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేవైఎం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు హెచ్‌ఎం, పీఈటీల సమావేశం

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని హెచ్‌ఎం, పీడీ, పీఈటీల సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ దామోదర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలు హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలు సమావేశానికి హాజరై మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు తేదీలు నిర్ణయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పరామర్శ..



కృష్ణయ్యను పరామర్శిస్తున్న సండ్ర

సత్తుపల్లి: డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, తుంబూరు సొసైటీ చైర్మన్ చిలుకుర్తి కృష్ణమూర్తిలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, యాగంటి శ్రీనివాసరావు, దొడ్డా శంకర్‌రావు, ఎస్‌కె.రఫీ, వల్లభనేని పవన్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కల్లూరురూరల్: మండలంలోని ముగ్గు వెంకటాపురం పంచాయతీలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గురువారం వరకు ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

దాడులను అరికట్టాలి

తల్లాడ: రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, సాంఘిక బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలని రజక సంఘం నాయకులు అన్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామంలో రజక వృత్తిదారులను బహిష్కరణ చేయడంపై మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో రజకులు చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు నరసింహారావు, బుల్లిరాములు, చిన్నారావు, అప్పయ్య, శ్రీను ఉన్నారు.

స్త్రీ నిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న నూరుద్దీన్

వేంసూరు: స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలతో మహిళా సంఘాల సభ్యులు పాడిగేదెలు, పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి చెందాలని అదనపు డీఆర్‌డీఓ నూరుద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళలకు పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న వ్యాపారాల నిర్వహణతో లాభాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం శ్రీను, పీఎం శ్రీనివాస్, పశువైద్యాధికారి షాఫియా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రంగారావు

ఎర్రుపాలెం: విద్యారంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు కోరారు. మంగళవారం మండలంలోని మీనవోలు, ఎర్రుపాలెం, జమలాపురం, రాజుపాలెం, బనిగండ్లపాడు తదితర పాఠశాలల్లో సంఘం సభ్యత్వాల నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని, అప్పటి వరకు అన్నింటిని భర్తీ చేయాలని, వలంటీర్లను నియామకం చేయాలన్నారు. స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణం రిలీవ్ చేయాలని, పెండింగ్ డీఏలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపల్లి సంగిరెడ్డి, పాటి బాలకృష్ణ, నాయకులు ఆర్.బ్రహ్మారెడ్డి, జంగా గురునాథ్ రెడ్డి, వెల్లంకి నాగరాజు, రుద్రపోగు శ్రీను, డి.లింగయ్య, ఫిలిప్, మదన్‌మోహన్‌రెడ్డి, మారపాక బాబూరావు, రమేష్, రాఘవరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతువేదికల వద్ద రైతులు బారులు



కొణిజర్ల: తనికెళ్ల రైతువేదిక వద్ద ఏఓ బాలాజీతో మాట్లాడుతున్న రైతులు

కొణిజర్ల: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు కాలేదంటూ పలువురు రైతులు మంగళవారం మండలంలోని పలు రైతువేదికల వద్ద బారులు తీరారు. రుణమాఫీ కాని రైతుల వద్ద నుంచి దరకాస్తులు తీసుకోవాలని మంగళవారం మండలంలోని గుబ్బగుర్తి, పల్లిపాడు, కొణిజర్ల, తనికెళ్ల రైతువేదికల వద్ద దరకాస్తు స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు రైతువేదికల వద్దకు చేరుకుని ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా తొలిరోజు 324 దరకాస్తులు వచ్చినట్లు ఏఓ బాలాజీ తెలిపారు.

ముదిగొండ: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం 357 దరఖాస్తులు స్వీకరించినట్లు ఏఓ ఎస్ సరిత తెలిపారు. రుణమాఫీకి సంబంధించిన సమస్యలు, సందేహాలపై ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రైతువేదికల్లో ఏఈఓలకు రైతులు అందజేయాలన్నారు.

బదిలీ సిబ్బందికి సన్మానం



బదిలీ అయిన వారిని సన్మానిస్తున్న సిబ్బంది

ముదిగొండ: ముదిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు సిబ్బంది దుర్గా మల్లేశ్వరీ, సత్యావతి, సరోజిని, వీరయ్య, మోహరున్నీషాబేగం, పిల్లిరాణి, నాగేశ్వరమ్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి, డాక్టర్ అరుణాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

ఏన్కూరు: హైదరాబాదులో ఇందిరాపార్కు దగ్గర గురువారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు ఎస్‌కే.లాల్ మియా కోరారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర్లు, రాములు, బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొణిజర్ల: హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ వైరా డివిజన్ నాయకుడు గోగుల సోములు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్లన్న నగర్‌లో మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎత్తేర రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. లాల్‌సింగ్, రవి, బాబు, రవి, గణేష్, లక్ష్మయ్య, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు



చింతకాని: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తల్లాడ: అన్నారుగూడెంలో..

చింతకాని: మండల పరిధిలోని లచ్చగూడెం, నేరడ, కోమట్లగూడెం, రేపల్లెవాడ, గాంధీనగర్ కాలనీల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పల్లె దవాఖాన డాక్టర్లు గ్రీష్మ, షోయల్, వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు పద్మావతి, సంధ్య, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు విజయచందర్, డాక్టర్ గోపి, శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, భాస్కర్ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏన్కూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాకర్లు సతీష్, సాయి, హెచ్‌ఎం కూరకుల సైదయ్య ఉన్నారు.

పొలం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కారేపల్లి: తన పొలంను ధ్వంసం చేసి, జేసీబీతో కాల్వ తవ్వి వరి పంట వేసుకోకుండా అడ్డుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలంటూ మండలంలోని గాదెపాడుకు చెందిన రైతు కొండబోయిన రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని నల్లకుంట చెరువు సమీపలంలో ఉన్న తన 4.10 ఎకరాల భూమిలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కాల్వ తీసి కట్ట పోశారన్నాడు. ఇపట్టికైనా అధికారులు స్పందించి తన పొలం పరిశీలించి తనకు న్యాయం చేయాలన్నారు.

విద్యార్థులకు వితరణ



వైరా: పెన్నులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న సభ్యులు



బోనకల్: భోజన ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాతలు

వైరా: లయన్స్‌క్లబ్ వైరా సభ్యుడు పాలేటి హరి జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని గుట్టబడి వైరా సీపీఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్‌రావు, హెచ్‌ఎం శ్రీనివాసచారి, క్లబ్ ఉపాధ్యక్షుడు కొల్లా రాంబాబు, మరికంటి రాంబాబు, నాగేశ్వరరావు, కట్ల సురేష్, ఉపాధ్యాయులు గృహలక్ష్మి, సునీత, పుష్ప, సైదా పాల్గొన్నారు.

ప్లేట్లు పంపిణీ

బోనకల్: మండల పరిధిలోని ముష్టికుంట్ల, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పిల్లలమర్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారులు ప్లేట్లు అందజేశారు. హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు..

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పినపాక జెడ్పీఎస్ఎస్ 9, 10 విద్యార్థులకు దగ్గుల నారాయణరెడ్డి నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు, వేమిరెడ్డి వెంకట్ నారాయణరెడ్డి, కోశాధికారి శీలం వెంకట్‌రెడ్డి, యాచవపరపు వెంకట్‌రెడ్డి, దాసరి శ్రీనువాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల ఆస్పత్రిల్లో పండ్ల పంపిణీ, రొట్టెలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: నివాళులర్పిస్తున్న నాయకులు



సత్తుపల్లిలో..



ఎర్రుపాలెంలో..

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



వేంసూరు: ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు



మధిర: ధర్నా చేస్తున్న రైతులు



చింతకాని: ఏపీజీవీ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, రైతులు



కొణిజర్ల: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



తల్లాడ: కుర్నవల్లి ఐఓబీ వద్ద..



కారేపల్లి: ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు



పెనుబల్లి: వినతిపత్రాలు అందజేస్తున్న రైతులు

మధిర: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్ వద్ద రైతులు నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు శీలం నరసింహారావు, మద్దాల ప్రభాకర్, మందడపు ఉపేంద్ర, పడకంటి మురళి, పుచ్చకాయల కిషోర్, వూట్ల శంకర్ రావు, బాజీనేని వెంకటనరసయ్య, అమరవాది మోహన్ రెడ్డి, మోహన్ రావు పాల్గొన్నారు.

చింతకాని: ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఏపీజీవీ బ్యాంక్ ఎదుట సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. బ్యాంక్ తలుపులకు తాళాలు వేసి నిరసన తెలిపారు. తోటకూరి వెంకటనర్సయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు కొండా గోపి, నాయకులు మద్దినేని వెంకటేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, వంకాయలపాటి సత్యనారాయణ, నెల్లూరి రమేష్, సైదులు, సామినేని బాబురావు, కొల్లి బాబు, పర్చగాని ఏడుకొండలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: రుణమాఫీ ప్రక్రియలో ప్రభుత్వం ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే పోరాటం తప్పదని సీపీఐ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. నాయకులు సుదర్శన్, శ్రీను, కృష్ణయ్య, భాస్కర్, నరసింహారావు తదితరులున్నారు.

తల్లాడ: షరతులు లేని రుణమాఫీ చేయాలని మండలంలోని కుర్నవల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సొసైటీ కార్యాలయం వద్ద తెలంగాణా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. నాయకులు సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, మౌలాసాహెబ్, గోపాలకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామక్రిష్టారెడ్డి, వెంకటయ్య, పుల్లయ్య ఉన్నారు.

వేంసూరు: స్థానిక తహసీల్ ఎదుట ప్రధాన రహదారిపై గంటపాటు రైతులు ధర్నా నిర్వహించారు. పాస్‌పుస్తకాలు ఉన్న ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కారేపల్లి: స్థానిక వ్యవసాయ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆందోళనకు మద్దతూ ప్రకటించి, షరతులు లేకుండా రుణమాఫీ చేయాని, రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు, నరేందర్, వజ్జా రామారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

పెనుబల్లి : మండలకేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయాధికారులు, రైతులకు వీడియో కాన్ఫరెన్స్‌తో వరిపైరులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు రుణమాఫీలో సందేహాలను సంబంధిత అధికారులు నివృత్తి చేశారు. అనంతరం రుణమాఫీపై సమస్యల పరిష్కారానికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏవీఎస్ ప్రసాద్, రైతులు పొట్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.